క్లుప్తంగా

విద్యుత్ చార్జీలు తగ్గించే వరకు పోరాడతాం

తెనాలిఅర్బన్: కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించే వరకు పోరాటాలు చేస్తునే ఉంటామని సీపీఎం నాయకులు కొల్లి పర బాబుప్రసాద్ హెచ్చరించారు. విద్యుత్ చార్జీల పెంపును నిరశిస్తూ మార్కెట్‌లోని అన్నాబత్తుని సత్యనారాయణ పురవేదిక వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు షేక్ హుస్సేన్‌వలి, కె రవికుమార్, షేక్ కరిముల్లా, ఎం పోతురాజు, ఎస్ బాలకోటేశ్వరరావు, కె సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయండి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



తెనాలిఅర్బన్: చినరావూరు పార్కులో జరుగుతున్న నిర్మాణ పనులు వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. శుక్రవారం ఉదయం ఆయన చినరావూరు పార్కులో జరుగుతున్న పలు అభివృద్ధి పనులు పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చినరావూరు పార్కును అందంగా అహ్లాదకరంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. జనవరి మొదటి వారంలో పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే శివాజీ చౌక్‌లో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులు పరిశీలించి ఆక్రమణలు జరకుండా చూడాలని ఆదేశించారు. ఆయన వెంట ఎఈ సూరిబాబు, హార్టికల్చర్ ఆఫీసర్ శేషుబాబు న్నారు.

వైకుంఠపురానికి టీటీడీ బోర్డు సభ్యుడు



తెనాలి: పట్టణంలోని ప్రసిద్ధి చెందిన శ్రీలక్ష్మీపద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం, వైకుంఠపురాన్ని తిరుమల తిరుపతి దేవస్థానముల ధర్మకర్తల మండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి శుక్రవారం సందర్శించారు. స్వామి దర్శనార్థం వచ్చిన భానుప్రకాష్‌రెడ్డికి ఆలయ కార్యనిర్వహణాధికారి వి.అనుపమ, వేదపండితులు, అర్చకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపించారు. పూజల అనంతరం వారికి వేదాశీర్వచనం, ఆలయ మర్యాద, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు. ధార్మిక పరిషత్ సభ్యులు, బీజేపీ నాయకులు పాపల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించుకోండి

చివలూరు(కొల్లిపర): గ్రామాలల్లో భూ సమస్యలు పరిష్కరించు కునేందుకు రెవిన్యూ సదస్సులు చక్కటి వేదిక అని, ఎవరైనా భూ సమస్యలతో ఇబ్బంది పడుతుంటే తక్షణమే రెవిన్యూ సదస్సుల్లో అర్జీలు ఇచ్చి పరిష్కరించుకోవాలని రైతులకు తహసీల్దారు జి.జిద్దార్థ పిలుపునిచ్చారు. కొల్లిపర మండల పరిధిలో చివలూరు గ్రామంలో శుక్రవారం రెవిన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ ప్రజా సమస్యల పరిష్కారానికి ఈ సదస్సులు దోహడ పడతాయన్నారు. అర్జీలు ఇచ్చిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రశీదులు పొందాలన్నారు.అనంతరం సదస్సులో వచ్చిన 10అర్జీలను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఐ వంశీ కృష్ణా , రైతులు పాల్గొన్నారు.

తాపీ కార్మికుడు ఆత్మహత్య

తెనాలిరూరల్: తాపీ కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు కథనం మేరకు పట్టణ గురవయ్య కాలనీకి చెందిన చలంచర్ల వీరయ్య(32) తాపీ పనులకు వెళుతుంటాడు. ఇటీవల అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఇతను ఇంట్లో శుక్రవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఫిర్యాదు అందుకున్న వన్‌టౌన్ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టమ్ నిమిత్తం తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్‌ఆర్‌ఈజీఎస్‌పై సోషల్ ఆడిట్



తెనాలిరూరల్: ఉపాధి హామీ పథకం కింద మండలంలో చేపట్టిన పనుల సోషల్ ఆడిట్‌ను శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. డ్వామా పీడీ వి. శంకరరావు, ఎంపీడీవో కార్యాలయ ఏవో ఆచంటి శ్రీనివాసరావు, ఎస్ఆర్‌పీ అచ్యుత్, ఇతర అధికారులు పాల్గొని గ్రామాల వారీగా చేపట్టిన పులు, చెల్లింపులు, పెండింగ్‌లో ఉన్న బిల్లులు వంటి అంశాలను పరిశీలించారు. ఆయా వివరాలను ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్ల నుండి అడిగి తెలుసుకున్నారు. అలాగే మండలంలో మంజూరైన జాబ్ కార్డులు, ఇతర అంశాలపై ఆడిట్ నిర్వహించారు. పలు గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

రాష్ట్రవాసుల ఆశలను ‘కూటమి’ వమ్ము చేసింది

- ఎన్నికల్లో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీల ఊసేలేదు
- విద్యుత్ చార్జీలు పెంచబోమని ఇచ్చిన హామీని తుంగలో తొక్కారు
- మాటతప్పి రూ.15 వేల కోట్లకు పైగా భారం మోపారు
- ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ రాయితీని రద్దుచేశారు.
- ‘పోరుబాట’లో మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



తెనాలి చెంచుపేటలో నిరసన ప్రదర్శనలో పాల్గొన్న పార్టీ శ్రేణులు



విద్యుత్ అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న శివకుమార్

తెనాలి: రాష్ట్ర ప్రజల ఆశలను కూటమి ప్రభుత్వం వమ్ము చేసిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తెనాలి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన సంక్షేమాన్ని కొనసాగించకుండా, ఎన్నికల్లో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను నెరవేర్చకుండా, విద్యుత్ చార్జీలను భారీగా మోపుతున్న కూటమి నేతలు రాష్ట్రప్రజలను నిలువునా మోసగించారని ధ్వజమెత్తారు. విద్యుత్ చార్జీల భారంపై పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం పోరుబాటను నిర్వహించారు. చెంచుపేటలోని విద్యుత్ డీఈఈ కార్యాలయం వరకు భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ విద్యుత్ చార్జీల బాదుడుపై నినాదాలు చేశారు. అక్కడే మీడియాతో మాట్లాడారు. విద్యుత్ చార్జీలను పెంచబోమని, అవసరమైతే తగ్గిస్తామని కూటమి నేతలు చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్‌లు ఎన్నికల్లో వాగ్దానం చేసినట్టు శివకుమార్ గుర్తుచేశారు. ఆర్నెల్లు తిరక్కుండానే రాష్ట్ర ప్రజలపై రెండు విడతలుగా రూ.15,485 కోట్ల భారాన్ని మోపుతున్నారని ఆరోపించారు. ఆ క్రమంలో నియోజకవర్గంలోని 1.23 లక్షల విద్యుత్ వినియోగదారులు కూడా నెలల తరబడి ఈ విద్యుత్ బిల్లుల భారాన్ని మోయాల్సిన దుస్థితిని కల్పించారని చెప్పారు. పైగా ఎస్సీ, ఎస్టీలకు గత ప్రభుత్వం అమలుచేసిన 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ రాయితీని రద్దుచేసి, ఆ వర్గాలపట్ల తమ నిర్దయను చాటారని విమర్శించారు. ఈ క్రమంలో నియోజకవర్గంలోని 18,524 మంది 200 యూనిట్ల విద్యుత్‌ను వినియోగించే ఎస్సీ, ఎస్టీలు రాయితీని కోల్పోవటమే కాకుండా పెంచిన విద్యుత్ చార్జీల భారాన్ని చెల్లించాల్సి వస్తోందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన చేయూత, అమ్మ ఒడి, రైతుభరోసా, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలను కొనసాగించకపోగా, ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను పట్టించుకోవటం లేదన్నారు. కూటమి ప్రభుత్వం కేవలం సామాజిక పింఛన్లను రూ.4 వేల చొప్పున మాత్రమే ఇస్తోందని, రకరకాల కారణాలతో రాష్ట్రవ్యాప్తంగా నాలుగు లక్షల మందికి పింఛన్లను జనవరి నుంచి రద్దు చేయనుందని శివకుమార్ చెప్పారు. తమ అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు ప్రతిదానికీ జగన్‌మోహన్‌రెడ్డిపై అబాండాలు మోపుతూ ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నించడాన్ని ఆయన తీవ్రంగా గర్హించారు. ఒకవైపు నిత్యావసరాల ధరలు పెరిగిపోయి, సంక్షేమ పథకాలు అందక బాధపడుతున్న ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారాన్ని మోపడం దారుణమని, పెంచిన చార్జీలను వెంటనే తగ్గించాల్సిందేనని డిమాండ్ చేశారు. రైతునాయకుడు కల్లం వెంకటప్పారెడ్డి మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు పెంచబోమని ఎన్నికల్లో ఇచ్చిన మాటను తప్పిన చంద్ర బాబు నాయుడుపై చీటింగ్ కేసును ఎందుకు పెట్టకూడదని ప్రశ్నించారు. మైనార్టీ నేత గోల్డ్ రహిమా తన ప్రసంగంలో చిన్న పరిశ్రమలకు విద్యుత్ చార్జీల పెంపు శరాఘాతంగా మారిందన్నారు. అన్నీ అబద్ధాలు చెబుతున్న కూటమి ప్రభుత్వాన్ని ఎందుకు అధికారంలోకి తెచ్చుకున్నామా? అని ప్రజలు వాపోతున్నారని చెప్పారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, మాజీ ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, పెదలంక వెంకటేశ్వర్లు, కఠారి హరీష్, మన్నవ శాంతకుమారి, అక్కిదాసు కిరణ్‌కుమార్ మాట్లాడారు. తొలుత విద్యుత్ డీఈఈ కార్యాలయంలో జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ ఎస్.శ్రీనివాస్‌కు వినతిపత్రం సమర్పించారు.

శరవేగంగా అభివృద్ధి పనులు

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



పనులకు శంకుస్థాపన చేస్తున్న చైర్‌పర్సన్ రాధిక

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో శరవేగంగా వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. గంగానమ్మపేటలోని పాత శివాలయం నుంచి గంగానమ్మ తల్లి గుడి వరకు ఇరువైపులా మురుగు నూతనంగా నిర్మించనున్న మురుగు కాల్వల నిర్మాణ పనులకు శుక్రవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలోని అనేక ప్రధాన రహదారుల విస్తరణ పనులు జరుగుతున్నాయని చెప్పారు. కమిషనర్ బండి శేషన్న మాట్లాడుతూ రూ.21లక్షలతో మురుగు కాల్వల నిర్మాణ పనులు చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్ తాడిబోయిన బ్రహేశ్వరరావు, ఇన్‌చార్జి ఎంఈ ఆకుల శ్రీనివాసరావు,టీపీవో సాంబశివరావు,ఎఈ భాషా తదితరులు పాల్గొన్నారు.

దేశాన్ని సంక్షోభం నుంచి రక్షించిన మన్మోహన్‌సింగ్



మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

తెనాలిరూరల్: దేశ ఆర్థిక ప్రగతికి తీసుకోవాల్సిన అత్యవసర చర్యలను అమలు చేసి ఆర్థిక మాంద్యం బారిన పడకుండా దేశాన్ని రక్షించిన ఆర్థికవేత్త డాక్టర్ మన్మోహన్ సింగ్ అని పలువురు కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. మాజీ ప్రధాని, దేశంలో ఆర్థిక సంస్కరణలకు పునాది వేసిన మన్మోహన్ సింగ్ మరణం పట్ల కాంగ్రెస్ పార్టీ తెనాలి నియోజకవర్గ నాయకులు విచారాన్ని వ్యక్తం చేశారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెనాలి నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ డాక్టర్ చందు సాంబశివుడు మాట్లాడుతూ ఒక ఆర్థికవేత్తగా దేశాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకు వెళ్లే దానిలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. దేనిలోనూ ఎక్కడా రాజీ పడని రాజకీయ నాయకుడిగా విజ్ఞాన వేత్తగా దివంగత మన్మోహన్ సింగ్ దేశానికి అందించిన సేవలు భారతావనికే స్ఫూర్తిదాయకమని డాక్టర్ చందు సాంబశివుడు అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు పొన్నూరు నాగ సూర్య శశిధర రావు, కొల్లిపర మండల ప్రెసిడెంట్ కర్లపూడి బుల్లయ్య, ఓబీసీ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ గురప్ర ద్వారకా శ్రీనివాస్, మాదాల పూర్ణచంద్రరావు, ఆల కష్ణ, పిల్లి ప్రభాకర్, భీమ రమేష్, శివన్నారాయణ, శంకరరావు,నాగూర్, సుబ్బారావు,కోటేశ్వరావు వీర స్వామి, శ్రీను, పోలేరామ్, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

గొప్ప ఆర్థిక సంస్కర్తను కోల్పోయిన దేశం

తెనాలి: మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ మరణంతో భారతదేశం గొప్ప ఆర్థిక సంస్కర్తను కోల్పోయిందని ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనారిటీ ఐక్యవేదిక జిల్లా ఉపాధ్యక్షుడు, అఖిల భారత గౌడ సంఘం జిల్లా యువత అధ్యక్షుడు కందుల వేణు వర్ధన్ శుక్రవారం ఒక ప్రకటనలో విచారం వ్యక్తంచేశారు. నాటి ప్రధాని పీవీ నరసింహారావు కేబినెట్‌లో ఆర్థిక మంత్రిగా పనిచేసిన మన్మోహన్ సింగ్ దేశంలో ఆర్థిక సంస్కరణలు అమలు చేయడంలో కీలకపాత్రను పోషించారని తెలిపారు. దాదాపు దశాబ్ద కాలం దేశ ప్రధానిగా సుదీర్ఘ సేవలు అందించి తనదైన ముద్ర వేసిన గొప్ప వ్యక్తి,ఉన్నత ఆలోచనపరుడు.దేశ ఆర్థిక వ్యూహాన్ని మారుస్తూ, దేశాన్ని గ్లోబల్ మార్కెట్‌లోకి చేర్చడంలో, దేశాన్ని ఆర్థిక శక్తిగా మార్చడంలో గొప్ప పాత్ర పోషించిన గొప్ప ఆర్థిక వేత్త మన్మోహన్ సింగ్ అని పేర్కొన్నారు. ఆయన సేవలను దేశం ఎప్పటికీ గుర్తుంచుకుంటుంది అన్నారు.

విజయవంతమైన పోరుబాట

తెనాలి: కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలపై మోపిన విద్యుత్‌చార్జీల బాదుడుపై తెనాలిలోని జరిగిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ‘పోరుబాట’ విజయవంతమైంది. విద్యుత్ చార్జీలను పెంచబోమని, అవసరమైతే తగ్గిస్తామంటూ చంద్రబాబు నాయుడు, పవన్‌కళ్యాణ్‌లు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించి, ఆర్నెల పాలనలోనే రెండు విడతలుగా రూ.15,485 కోట్ల ఛార్జీల భారాన్ని ప్రజలపై మోపుతుండటాన్ని నిరసిస్తూ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపునకు నియోజకవర్గంలోని పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు స్పందించారు. వందలాదిగా చెంచుపేటకు చేరుకున్నారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ నేతృత్వంలో పార్టీ జెండాలు, ప్లకార్డులను చేతపట్టి నిరసన ప్రదర్శనగా బయలుదేరారు. విద్యుత్ ఛార్జీల బాదుడును నిరసిస్తూ నినాదాలు చేశారు. చెంచుపేటలోని విద్యుత్ డీఈఈ కార్యాలయానికి చేరుకుని కూటమి ప్రభుత్వ విద్యుత్ ఛార్జీల బాదుడుపై నినాదాలు చేశారు. సూపర్‌సిక్స్ హామీలు ఎక్కడ బాబూ అని ప్రశ్నించారు. ఛార్జీలను తగ్గిస్తామంటూ ఈ బాదుడేంది బాబూ అంటూ నినాదాలు చేశారు. పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఈఈ కార్యాలయంలో డీఈఈ అందుబాటులో లేకపోవటంతో జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ ఎస్.శ్రీనివాస్‌కు విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రాన్ని మాజీ ఎమ్మెల్యే శివకుమార్, పార్టీ నాయకులు కలిసి అందజేశారు.

తెనాలి మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, కొల్లిపర ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి, కొల్లిపర సర్పంచ్ పిల్లి రాధిక, ఎంపీటీసీ శ్రీలత, పార్టీ పట్టణ అధ్యక్షులు మద్దాళి శేషాచలం, షేక్ దుబాయ్‌బాబు, కౌన్సిలర్లు తోట రఘురాం, గోడవర్తి సాయిహరేరామ్, మల్లెబోయిన రాము, కఠారి హరీష్, పెదలంక వెంకటేశ్వర్లు, కుర్రా శ్రీను, పెచ్చింగ్ సుభాని, పార్టీ నేతలు దేసు శ్రీనివాసరావు, బూరెల దుర్గా, ఈదా యశ్వంత్‌రెడ్డి, వంపుగొళ్ల కృష్ణ, జలగం రామకృష్ణ, శానంపూడి రఘురామిరెడ్డి, తాడిబోయిన రమేష్, కొమ్ము రాయల్, జొన్నల శివారెడ్డి, వంగా సుధాకరరెడ్డి, మాజీ ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, కావటి నిర్మల, మన్నవ శాంతకుమారి, మున్నంగి సుజాత, ఇందిర, పచ్చవ రమేష్, బేతాళ భూషణం, అక్కిదాసు కిరణ్‌కుమార్, ఉన్నవ చంద్రశేఖరరావు, పిల్లి గంగాధర్, కుర్రా జస్వంత్, వేముల మహేష్, పెసర్లంక రమణ, టెక్స్ బాల తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు

ఏడీఏ ఉషారాణి



తూములూరు ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న ఉషారాణి

కొల్లిపర: ఎరువులు డీల్లర్లు ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే రైతుల వద్ద నుంచి ఒక్క రూపాయి వసూళ్లు చేసిన దుకాణ దారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవటంతోపాటు డీలర్ల లైసెన్స్ పూర్తిగా రద్దు చేయటం జరుగుతుందని తెనాలి ఏడీఏ ఉషారాణి హెచ్చరించారు.శుక్రవారం మండలంలోని తూములూరు, కొల్లిపర గ్రామంలోని ఎరువుల దుకాణాలపై ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా రబీసీజన్‌లో కొల్లిపర మండలంలో రైతులు జొన్న, మొక్కజొన్న 13,600 ఎకరాలల్లో సాగు చేపట్టారు. ఈ సాగుకు అవసరమైన యూరియా, డీఏపీ , కాంప్లెక్స్ ఎరువులు పుష్కలంగా ఉన్నాయి. రైతులు ఎరువులు కొరత వస్తుంది అని అపోకలు పెట్టుకోకుండా అవసరమైన మేరకు ఎరువులు కొనుగోలు చేసి వాడుకోవాలని సూచించారు. ఎరువులు కొనుగోలు చేసే రైతులు డీలర్లు అధిక రేట్లు తెలిపితే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని, డీల్లర్లు వద్ద నుండి రశీదు తీసుకుని ఫిర్యాదు చేయవచ్చు అని తెలిపారు, ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుటామని, రైతులు అధిక ధరలు వసూలు చేస్తుంటే వెంటనే పిర్యాదు చేసినప్పుడే అధికారులు వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవటానికి వీలు ఉంటుందని అన్నారు.అనంతరం వివిధ ఏరువుల దుకాణంలో ఎరువులు, రికార్డులు పరిశీలించారు.ఈకార్యక్రమంలో మండల ఏఈఓ పి.మురళీ పాల్గొన్నారు.

అనాథలతో అంగడి పెట్టించిన తహసీల్దార్



అంగడి ప్రారంభోత్సవంలో ట్రైనీ ఐఏఎస్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్, తహసీల్దార్ గోపాలకృష్ణ

తెనాలిరూరల్: వారంతా విధి రాత వలన అనాథలైన వారు.. నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించే హోమ్‌లో చేరిన వారు ఇతరులపై ఆధారపడకూడదన్న సంకల్పంతో తమ సృజనకు పదును పెట్టారు. వివిధ వస్తువులు, హ్యాండ్ బ్యాగులు తయారు చేస్తున్నారు. ఈ విషయాన్ని తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ గుర్తించారు. ఎమ్మార్పీఎస్ నాయకుడు కిన్నెర నాగరాజు ఇటీవల అంగలకుదురులోని జేఎంజే స్వధార్ హోమ్‌లో అనాథలు, వితంతువులు ఉంటున్నారని, వారికి ప్రభుత్వ పరంగా సాయం అందేలా చూడాలని గ్రీవెన్స్‌లో కోరారు. మరునాడు స్వధార్ హోమ్‌ను తహసీల్దార్ పరిశీలించారు. అక్కడ ఉంటున్న వారి స్థితిగతులను స్వయంగా చూశారు. ప్రభుత్వం నుంచి నెలనెలా 50 కిలోల రేషన్ బియ్యం అందజేస్తామని, అర్హత ఉన్న వారికి పింఛన్‌లు ఇస్తామని, ఉపాధి అవకాశాలను కల్పిస్తామని హామీ ఇచ్చారు. అక్కడ ఉంటున్న వారిలో కొందరు బొమ్మలు, బ్యాగులు తయారు చేస్తున్నారని గుర్తించారు. వీరి సృజననే పెట్టుబడిగా పెట్టించి వీరికి జీవనోపాధి కల్పించాలని ఆలోచన చేశారు. ఆర్టీసీ డిపో మేనేజర్ రాజశేఖర్‌తో మాట్లాడారు. చిన్న అంగడి ఏర్పాటు చేసుకోవడానికి జాగా ఇవ్వమని కోరగా ఆయనా అంగీకరించారు. తహసీల్దార్ స్వయంగా అంగడి తయారు చేయించారు. బస్టాండ్ వద్ద అంగడిని పెట్టించి, ట్రైనీ ఐఏఎస్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ శుక్రవారం ప్రారంభించారు. జేఎంజే స్వధార్ హోమ్ నిర్వాహకుల పర్యవేక్షణలో అక్కడ ఉండే అనాథ బాలికలు, యువతులు తయారు చేసిన వస్తువులను ఇక్కడ ఇక్రయిస్తారని, విధి రాత వల్ల నష్టపోయిన వీరికి ప్రజలు అండగా నిలవాలని తహసీల్దార్ కోరారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

–కోస్టల్ బ్యాంక్ మేనేజర్ నాగరాజు



తెనాలిఅర్బన్: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించటమే లక్ష్యంగా కోస్టల్ బ్యాంక్ పనిచేస్తుందని బ్యాంక్ మేనేజర్ సి.హెచ్. నాగరాజు పేర్కొన్నారు. కోస్టల్ బ్యాంక్‌ను తెనాలిలో ఏర్పాటు చేసిన రెండు సంవత్సరాలు అయిన నేపథ్యంలో కలారి హస్పిటల్, శంకర్ నేత్రాలయం సహకారంతో శుక్రవారం బ్యాంక్ ఆవరణలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పలువురు వైద్యులు ఖాతాదారులకు వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, ప్రముఖ వ్యాపారి ఉప్పల వరదరాజులు, కాకతీయ సొసైటీ చైర్మన్ డీఎల్ కాంతారావు పాల్గొన్నారు.

కూచిపూడి నృత్యపతాక స్వర్ణోత్సవాలకు తేజస్వి ప్రఖ్య

నేటి సాంస్కృతిక వేడుకల్లో నృత్యప్రదర్శనకు అవకాశం



తెనాలి: పట్టణానికి చెందిన కూచిపూడి యువనర్తకి ఆరాధ్యుల తేజస్వి ప్రఖ్యకు అరుదైన అవకాశం లభించింది. కృష్ణాజిల్లా మొవ్వ మండలం కూచిపూడిలో అంగరంగ వైభవంగా జరుగుతున్న ప్రపంచస్థాయి కూచిపూడి నృత్య పతాక స్వర్ణోత్సవ వేడుకల్లో నర్తించనున్నారు. శనివారం మధ్యాహ్నం 12.55 నుంచి 1.10 గంటల వరకు నృత్య ప్రదర్శన చేయనున్నారు. ప్రపంచస్థాయిలో జరుగుతున్న మూడురోజుల స్వర్ణోత్సవ వేడుకల్లో నృత్యప్రదర్శనకు అవకాశం కల్పించిన కూచిపూడి హెరిటేజ్ ఆర్ట్స్ సొసైటీ నిర్వాహకులు డాక్టర్ వేదాంతం నాగవెంకటాచలపతికి ఆమె ధన్యవాదాలు తెలియజేశారు. ప్రముఖ స్వాతంత్ర్య యోధుడు ఆరాధ్యుల బలరామమూర్తి మనవరాలైన తేజస్వి ప్రఖ్య ఎంఏ (ఇంగ్లిష్), ఎంఏ (కూచిపూడి నృత్యం) చేశారు. ప్రస్తుతం కూచిపూడి నృత్యంలోనే పీహెచ్‌డీ చేస్తున్నారు. ఎన్‌సీసీ బి సర్టిఫికెట్, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ వారి ‘రాజ్యపురస్కార్’ను స్వీకరించారు. హిందీలో ప్రవీణ చేశారు. దూరదర్శన్‌లో బీ గ్రేడ్ ఆర్టిస్ట్‌గా కొనసాగుతున్నారు. 2003 నుంచి ఇప్పటివకు దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలు, ప్రతిష్టాత్మక వేదికలపై 980 ప్రదర్శనలిచ్చారు. రాష్ట్రపతి, నలుగురు గవర్నర్లు, నలుగురు సీఎంల చేతులమీదుగా అవార్డులు, సత్కారాలు అందుకున్నారు.

ఆంధ్రలో షూటింగ్‌లకు మెరుగైన అవకాశాలు



మాట్లాడుతున్న దిలీప్‌రాజా

తెనాలి: టాలివుడ్‌లో ఇటీవల జరిగిన పరిణామాల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు సినిమాల షూటింగ్‌లు జరిగేందుకు అవకాశాలు మెరుగయ్యాయని మా–ఏపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, సినీదర్శకుడు దిలీప్‌రాజా అన్నారు. మా–ఏపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇప్పటికే కొందరు నిర్మాతలు రాష్ట్రంలో సినిమా షూటింగ్‌లకు సన్నాహాలు చేస్తున్నారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ఇటీవల సినీ నిర్మాతలను రాష్ట్రంలో సినిమాల చిత్రీకరణకు స్వయంగా ఆహ్వానం పలికినట్టు గుర్తుచేశారు. విశాఖలో ఇప్పటికే సినీస్టూడియోలు నిర్మాణంలో ఉన్నాయనీ, తలకోన, తడ, హార్సిలీ హిల్స్, కోనసీమ, భవానీ ద్వీపం, కొండవీడు, సూర్యలంక బీచ్, అరకులోయ వంటి ఎన్నో అందమైన లోకేషన్లు రాష్ట్రంలో అందుబాటులో ఉన్నాయని గుర్తుచేశారు. రాష్ట్రంలో సినిమాల చిత్రీకరణకు ముందుకొచ్చే నిర్మాతలకు ఎఫ్‌డీసీ ద్వారా తగిన సహాయం చేసేందుకు మా–ఏపీ కూడా సహకరిస్తుందని వివరించారు. వీరితో సహాయ దర్శకులు నరేష్ దోనె, మణివరన్, నటుడు వేమూరి విజయ భాస్కర్ ఉన్నారు.

విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి



విద్యార్థులతో ఎంఈవో లక్ష్మీనారాయణ, శివశంకర్

తెనాలిఅర్బన్: విద్యతో పాటు క్రీడల పట్ల విద్యార్థులు ఆసక్తిని కలిగి ఉండాలని తెనాలి మండల విద్యాధికారి మేకల లక్ష్మీనారాయణ సూచించారు. పూర్వ విద్యార్థుల సంఘం వ్యవస్థాపకులు తన్నీరు శివశంకర్ ఆధ్వర్యంలో వివిధ క్రీడలలో రాణించిన విద్యార్థులకు శుక్రవారం కొత్తపేటలోని మున్సిపల్ బాయ్స్ హైస్కూల్‌లో మెడల్స్, ప్రసంశపత్రాలు అందజేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదవుతూ క్రీడల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. తన్నీరు శివశంకర్ మాట్లాడుతూ తామంతా ఇదే స్కూల్‌లో చదువుకున్నామని గుర్తు చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎస్ఆర్‌కె శర్మ, చుక్కా భాను ప్రసాద్, కె.కె.శ్రీను, న్యాయవాది పొన్నం విజయకుమార్, వీరబ్రహేంద్ర, హెచ్ఎం బి.శ్రీనివాసు, ఉపాధ్యాయులు సర్దార్, ప్రసాదకుమారి, కొడాలి గోవర్ధన తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ‘స్నేహ హస్తం’



తెనాలిరూరల్: రైల్వే ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ‘స్నేహ హస్తం’ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రైల్వే అసిస్టెంట్ పర్సనల్ ఆఫీసర్ పి. శ్రీనాథ్ తెలిపారు. తెనాలి రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో శుక్రవారం స్నేహ హస్తం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంక్రిమెంట్లు, సర్వీస్ ప్రమోషన్లు, యూఎంఐడీ కార్డులు, తదితర సమస్యల గురించి సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ ఆనంద్ కట్టా ఆదేశాలతో కార్యక్రమాన్ని నిర్వహించినట్లు శ్రీనాథ్ తెలిపారు. మొత్తం 60 సమస్యలను పరిష్కరించారు. 15 పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. స్టేషన్ మేనేజర్ టీవీ రమణ పర్యవేక్షించారు.

ముగిసిన అన్నసంతర్పణ



ముత్యంశెట్టిపాలెంలోని శ్రీహరిహరపుత్ర అయ్యప్ప స్వామి వారి దేవస్థానంలో 40 రోజులుగా జరుగుతున్న అన్నసంతర్పణ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. అయ్యప్ప స్వామి వారికి అన్నాభిషేకం చేసి స్వాములకు, భక్తులకు అన్నసంతర్పణ చేశారు. బట్టు దుర్గారావు స్వామి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. –తెనాలి అర్బన్